
# తేనె పూసిన కత్తి

పులిగడ్డ విశ్వనాథరావు



"రాధా ఇవాళ మా కొత్త కొలీగ్ జానకి నన్ను, నిన్ను రేపు రాత్రి వాళ్ళింటికి డిన్నర్‌కి ఆహ్వానించింది" అన్నాడు శ్రీపతి సంబరంగా.

ఆఫీసు నుంచి వస్తూనే.

"ఎందుకో"— అడిగింది రాధ.

"ఎందుకేంటి. ఆమె తన ఫ్రెండ్స్‌కి డిన్నర్ పార్టీ ఇస్తోందట. మా ఆఫీసు నుంచి ఇద్దరు పెద్ద బాస్‌ల్ని ఆహ్వానించింది. వారితో సహా నన్ను కూడా ఆహ్వానించింది."

"చాలా బాగుంది. రెండు సబ్బుపొడి డబ్బాలను కొంటే ఒక దువ్వెన ఉచితంగా ఇస్తారుగా, ఆ మాదిరి గానే వారితోసహా..."

"ఐతే నేను ఆ దువ్వెనతో సమానమనా?"

"లేకపోతే మీ కొలీగ్ మిస్ జానకిగారికి ఆఫీసులో అంతమంది అభిమానులు వుండగా మీమీదే అంత దయ, ఎందుకో! విడాకులు తీసుకున్న వన్నెల విసినికర్ర కూడా."

"ఛ. ఛ. నీ ఆడబుద్ధి పోనిచ్చుకున్నావు కాదు. ఆమె ఎక్కడ, నేనెక్కడ. ఆమే కోరుకుంటే పెద్దపెద్ద బాసులచేత పాదసేవ చేయించుకోగలదు. అలాంటిది వాళ్ళముందు నేనేపాటి. ఇంతకీ ఆమె మంచి స్వభావం గలది. నేను ఆఫీసులో మోస్ట్ ఎఫిషెంట్ మనిషిని కాబట్టి నన్ను ఆదరిస్తుంది."

"గుడ్డికన్ను తెరుస్తే ఎంత, మూస్తే ఎంత అన్నట్టు మోస్ట్ ఎఫిషెంట్ అయితే మాత్రం ప్రయోజనం ఏమిటి? బాగా పనిచేస్తే అవుట్ ఆఫ్ ప్రొమోషన్ వచ్చేస్తుందనా, లేక ఆఫీసులో కునుకుపాట్లు పడుతూంటే ప్రభుత్వం శాంక్షన్ చేసిన కరవుభత్యం వాయిదాలు మీకు ఇవ్వరనా."

"నువ్వు అలాగంటే ఎలా చెప్పు రాధా. ఆమె ఎంతో ఉత్తమురాలు. ఆమె నన్ను తన రూముకు ఆహ్వానించి పాలిటిక్స్, సంగీతం, నృత్యం అన్నిటి గురించి చర్చిస్తుంది. ఆమెకు శాస్త్రీయ సంగీతం, లలిత సంగీతం రెండింటిలోనూ అభిరుచి వుంది. పాడుతుంది కూడా. నృత్యంలో కూడా ప్రవేశం వుందట."

"ఇంకేం. ఆఫీసులో నోట్లు రాయడానికి బదులు మ్యూసికల్ నోట్లు ఆలపిస్తూ, 'ఫర్దర్ స్టెప్స్" గైకొనడానికి బదులు స్టెప్స్‌వేస్తూ ప్రభుత్వ కార్యకలాపాలను ఇంకా ఎఫిషెంట్‌గా నడిపించవచ్చు."

"మెచ్చుకున్నాంలే నీ విట్‌ని. పూర్తిగా విను. మాటల సందర్భంలో ఆమె తన బాధ నాకు చెప్పుకుంది. ఆమె ఏదో స్టేట్‌మెంట్ ఆఫ్ అకౌంట్స్ తయారుచేయాలట. తనకు కొత్తట. అప్పటికే ఆమె తాను రఫ్‌గా చేసిన స్టేట్‌మెంట్ చూపింది. అంతా తప్పుల తడకే."

"ఎదురుగా మాటికి లోపు వున్న తలకాయలను కూడా సరిగ్గా లెక్కించలేని మహోన్నత పదాధికారులు లేరా? ఈమె కూడా అలాంటి మేధావిలాగే వుంది."

"నువ్వు ఏమి అను_ఆమె బాధచూసి నాకు జాలి వేసింది. పాపం ఆమెకు తీరిక కూడా లేదట. స్టేట్‌మెంట్ ఆ రోజు పంపకపోతే బాస్ మండిపడతాడట. అసలే రావణాసురుడిలాంటివాడు. ఏమి చేయాలో పాలుపోక కంట తడిపెట్టుకున్నంత పని చేసింది. పాపం ఆమె బాధ చూడలేక నేనే అకౌంట్స్ బుక్స్ స్టడీచేసి అలికి ముగ్గేసినట్టు స్టేట్‌మెంట్ ఆఫ్ అకౌంట్స్ తయారుచేసి ఇచ్చాను. ఆమె నన్ను ఎంతో మెచ్చుకుని, థ్యాంక్స్‌తో ముంచెత్తి 'ఐ ఓవ్ యు ఏ గ్రాండ్ పార్టీ' అంది. అందుకే ఈ ఆహ్వానం అనుకో."

"ఎంత మార్పు వచ్చిందండీ మీలో! మీ బాస్ సైతం ఆదేశించినా మీ పని కాకుండా ఏ ఇతర పనైనా చేస్తారా?"

"అది నిజమే అనుకో. కాని మనిషికీ మనిషికీ తేడా వుండదూ? మా బాస్ ముళ్ళపందిలాంటి వాడు. అతడిని చూస్తేనే అందరికి కడుపులో ఆవదం తాగినట్టు అవుతుంది. మరి ఈమె ఎక్కడ? ఈమె బృందావనం తోట ఐతే అతడు విజయనగరం పెద్ద చెరువు. ఈమె పలుకులు కోకిలగానం అయితే అతడి రంకెలు కెనడియన్ ఇంజన్ కూతలు."

"చాల్లెండి మీ కవిత్వం. ఇంతకీ నాకెందుకులెండి మీ ఆఫీసు గొడవలు."

"అలా అన్నావు బాగుంది. కాని ఈ మాట నువ్వు ముందే చెప్పివుండవలసింది. అన్నట్టు మరిచాను. ఇవాళ నువ్వు నా క్యారియర్‌లో వుంచిన బిర్యాని జానకిగార్కి కూడా పెట్టాను. ఆమె నీ బిర్యానీని తెగ మెచ్చుకుని రేపు తానుకూడా డిన్నర్‌లో స్పెషల్ బిర్యాని పెడతానని చెప్పింది. నీతో మొదటి పరిచయం కాబట్టి నీతో వేరేగా మాట్లాడవచ్చునని మనల్ని కాస్త ముందుగా రమ్మనమంది."

"ఈ అభిమాన సంపదని మనం మోయగలమా లేదా అనే సందేహం కలుగుతోంది నాకు."

"మోచేతి కంకణానికి అద్దమేల? నువ్వు రేపు ఎలాగూ ఆమెను కలుసుకుంటావుగా."

మర్నాడు సెలవు. శ్రీపతి, రాధలు డిన్నర్‌కని సాయంత్రం ఐదింటికి జానకిగారి ఇల్లు చేరుకున్నారు. ఆమె ఆప్యాయతతో ఇద్దరినీ ఆహ్వానించి డ్రాయింగు రూములో కూర్చోబెట్టి స్వయంగా టీ ఇచ్చింది. మనిషి చిలకలా వుంది. గర్వం, ఆర్భాటం లేదు. కొద్దిసేపు పిచ్చాపాటి చేసి రాధతో "మీరు నిన్న చేసిన బిర్యాని అద్భుతంగా వుంది. మీరు చెబితే బిర్యాని వండేస్తాను. మా వంటవాడు సెలవు పెట్టాడులెండి."

రాధ ఆమెకు బిర్యాని వండడం చెప్పడానికి ఆమెతో వంటింట్లోకి వెళ్ళింది. ఆమెకు వంట రాదని రాధ వెంటనే గ్రహించింది. తానే బిర్యాని వండిపారేస్తే పోతుందని వంట మొదలెట్టింది రాధ. మిగతా వంటకాలు కూడా సరిదిద్దనారంభించింది. జానకిగారు సాయం చేస్తోంది.

ఆఫీసులో కొంతమంది స్త్రీలు మగ కొలీగ్స్‌ని ఎలా ఎక్స్‌ప్లాయిట్ చేస్తారో చూస్తూనే వుంటాం గదా. అదే ఈ కథకి ఆధారం.

ఇంతలో అతిథులు రానారంభించారు. వాళ్ళను ఆహ్వానించి మాట్లాడాలిగా! జానకిగారు ఆ పనిలో నిమగ్నమైంది. రాధ ఒక్కర్తే వంటింట్లో పని చూసుకుంటోంది. శ్రీపతి డ్రాయింగు రూములో అతిథులతో పిచ్చాపాటి చేస్తున్నాడు. జానకిగారు శ్రీపతితో "శ్రీపతిగారూ! నేను ఐస్‌క్రీమ్ కోసం ఆర్డర్ ఇచ్చాను. అడ్వాన్సు కూడా ఇచ్చానులెండి. వెళ్ళి తీసుకొస్తాను. మీరు గెస్టులతో మాట్లాడుతూ వుండండి" అంది.

గెస్టులలో వున్న ఒక పెద్దబాసు ఇది విన్నట్టుంది. అతడు "బాగుంది మిస్ జానకీ! మీరు ఇప్పుడు బైటకు వెళ్ళడమేమిటి? శ్రీపతి ఆపాటి సాయం చేయలేడా?" అన్నాడు.

"ఆఁ! మీరు వుండండి జానకిగారు. నాకు ఎడ్రస్ ఇవ్వండి. ఈ లోగా అక్కడికి ఫోన్ చేయండి. నేను వెళ్ళి తెస్తాను" అని అనక శ్రీపతికి తప్పలేదు.

ఐస్‌క్రీమ్ సరఫరాచేసే రెస్టారెంట్ చిరునామా ఇచ్చి "మీరు ఎలాగూ అటు వెళుతున్నారు కాబట్టి పుల్లారెడ్డి నుంచి కిలో మిఠాయి, డజను కిళ్ళీలు కట్టించుకు తీసుకురండి. ఇదిగో డబ్బు" అంటూ పాతిక రూపాయిలు ఇచ్చింది. ఇంకా అవసరం వుంటుందని అనడానికి శ్రీపతికి మొహమాటమేసింది.

బస్సులో వెళ్లితెస్తే రాత్రికి రానట్టే లెక్క. అందుకోసం ఆటోరిక్షా మాట్లాడుకుని ఐస్‌క్రీమ్ సప్లయ్‌చేసే రెస్టారెంట్‌కి వెళ్ళాడు. అక్కడ నుంచి ఐస్‌క్రీమ్ తీసుకుని, పుల్లారెడ్డి నుంచి స్వీట్స్ కొని, కిళ్ళీలు కట్టించుకుని జానకిగారింటికి చేరేసరికి తొమ్మిదయింది. అంటే గంటన్నర పట్టిందన్నమాట. ఆటో రిక్షా, మిఠాయి, కిళ్ళీలకు అరవై రూపాయిలు ఖర్చు అయింది. జానకిగారు ఇచ్చింది ఇరవై ఐదు రూపాయిలే. మిగతాది తన జేబులోంచే.

శ్రీపతి కాల్‌బెల్ మ్రోగించగా జానకిగారే తలుపు తెరిచింది. నవ్వుతూ "శ్రీపతిగారూ టైమ్‌కే వచ్చారు. ఇప్పుడే అంతా డిన్నర్ ముగించారు. స్వీట్స్, ఐస్‌క్రీమ్‌కి! ఇదే అదును. ఐతే పాపం మిమ్మల్ని ఎంతో మిస్ చేశాం" అంది ప్యాకెట్లు అందుకుంటూ.

'ఐతే డిన్నర్ అయిపోయిందన్నమాట! తాను పాల్గొనలేదే...'మనస్సు చివుక్కుమన్నా బైటకుమాత్రం మందహాసంతో "ఫర్వాలేదులెండి" అన్నాడు శ్రీపతి.

"థ్యాంక్స్ ఎలాట్. మీరు, మీ భార్య నా పరువు కాపాడారు. మీరిద్దరూ నాపట్ల చూపుతున్న అభిమానం రక్తసంబంధీకులకు కూడా వుంటుందా అని అనిపిస్తోంది."

రాధకూడా డిన్నర్‌లో పాల్గొనలేదట. జానకిగారు అందరితో కలిసి భోజనానికి కూర్చోవాలిగా. వడ్డన కూడా రాధే చేయవలసివచ్చిందిట.

అతిథులు వెళ్ళాక జానకిగారు శ్రీపతికి, రాధకు స్వయంగా వడ్డించారు.

మర్నాడు ఆఫీసులో జానకిగారు శ్రీపతిని పిలిచి థ్యాంక్స్ చెప్పి "మీ ఆవిడ వండిన భోజనం ఫైవ్‌స్టార్ హోటల్ భోజనాన్ని మరిపించిందని అందరూ మెచ్చుకున్నారు. ఇటువంటి భార్యగల మీరు లక్కీ..." అంటూ స్తోత్రం మొదలెట్టింది.

"దానికేముంది. మా విధి కదా" అన్నాడు శ్రీపతి.

"శ్రీపతిగారూ! ఈ ఆఫీసులో మీరు తప్పించి ఎవరైనా ఇంటెలిజెంట్ మనిషి వున్నాడా అని అనిపిస్తోంది. చూడండి-సారథిగారు ఈ రిపోర్టు డ్రాఫ్ట్ చేశారు. కాని ఎన్ని తప్పులున్నాయో. నేను మధ్యాహ్నం బడ్జెట్ మీటింగ్‌కి వెళ్ళాలి. ఈ రిపోర్టు కూడా ఇవాళే పంపాలి. ఏమి చెయ్యాలో పాలుపోవడం లేదు. తొందరలేదు కదా_కాఫీకి ఆర్డరిచ్చాను."

"మీటింగు మధ్యాహ్నం మూడింటికి కదా. ఈలోగా మీరు రీడ్రాఫ్ట్ చేయవచ్చు" అన్నాడు శ్రీపతి ముక్తసరిగా.

జానకిగారి చిరునవ్వు మందగించింది. ఐనా తక్షణం మరింత మందహాసంతో "అంతే చేయాలి మరి" అంది.

"శ్రీపతిగారూ! రేపు రవీంద్రభారతిలో ఎం.ఎస్. గానకచేరిట. మీకు తెలుసుకదా?"

"తెలుసు. పత్రికలో చూశాను"

"ఐతే మీరు టిక్కెట్లు తెప్పిస్తున్నారా?"

"లేదండి" అంటూ శ్రీపతి లేచాడు.

"అరే మీరు వెళుతున్నారే? కాఫీ వస్తోంది. కూర్చోండి."

"క్షమించండి జానకిగారు. ఐ యామ్ టెరిబ్లీ బిజీ" అని చెప్పి శ్రీపతి బైటకువచ్చి వడివడిగా తన రూమువైపు నడిచాడు. ●